క్లుప్తంగా

ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం



కంబగిరి స్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి ఆలయ ఆవరణలో లక్ష్మిదేవి అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా మహాసంప్రోక్షణ హోమం శనివారం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ అభయాంజనేయస్వామి ఆలయాల్లో శని త్రయోదశిని పురస్కరించుకుని అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

సమయ పాలన పాటించాలి

గోస్పాడు: సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఈఓఆర్డీ నాగేంద్రుడు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలకు సౌకర్యార్థంగా ఉండేందుకు సచివాలయాలను ఏర్పాటు చేసిందన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని చెప్పారు. వేసవి తీవ్రత అధికమవుతుందని, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది నియామకం

శిరివెళ్ల: ఈ నెల 13వ తేదీన జరగనున్న పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయని తహసీల్దార్ షేక్ మొయిద్దీన్ శనివారం తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని, పాఠశాలలోని 10వ గదిలో పట్టభద్రుల పోలింగ్ బూత్, 7వ గదిలో టీచర్లకు బూత్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బూత్‌లో ఒక పీఓ, నలుగురు పోలింగ్ క్లర్కులను నియమించామని చెప్పారు. సిబ్బందికి నంద్యాల ఆర్డీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారని, 7వ తేదీ నుంచి ఓటర్లకు స్లిప్పుల పంపిణీ మొదలవుతుందన్నారు. మండలంలో 1,313 మంది పట్టభద్రులు, 67 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వివరించారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపిద్దాం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్

నంద్యాల(రూరల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని నంద్యాల మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్ కోరారు. శనివారం మండల పరిధిలోని రాయమాల్పురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూలశీను, బాషాతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలను ప్రారంభిస్తున్న దస్తగిరిరెడ్డి

నంద్యాల(అర్బన్): విధి నిర్వహణలో ఒత్తిడికి గురవుతున్న ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని గురురాజ విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహులు పేర్కొన్నారు. మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం గురురాజ పాఠశాల ఆవరణంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగినులకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ప్రారంభించారు. సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రప్ప, జిల్లా సహాయ అధ్యక్షుడు గిరి శివశంకర్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అహోబిలేశుడి సేవలో..



న్యాయమూర్తికి పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న పండితులు

ఆళ్లగడ్డ: అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఎగువ, దిగువ క్షేత్రాల్లో ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా వారు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం మఠం పీఠాధిపతిని దర్శించుకుని ఆశీర్వచనాలు తీసుకున్నారు.



ముస్తాబయిన లక్ష్మీనరసింహస్వామి దేవాలయం



పుట్టాలమ్మ ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం

సింహ వదనా.. భక్తవత్సలా

- నేటి నుంచి శ్రీరామతీర్థ లక్ష్మీ నారసింహుడి బ్రహ్మోత్సవాలు
- స్వస్తివాచనంతో వేడుకలు ప్రారంభం
- ఆరు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలు
- 10న వసంతోత్సవం, పాన్పుసేవతో ముగింపు
- భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

ఆళ్లగడ్డ : కోరికలు నెరవేర్చి భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతున్న రామతీర్థం క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొండపై కొలువైన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. నారసింహుడి బ్రహ్మోత్సవాలకు సంబంధించి అధికారులు, పాలకమండలి తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల సందర్భంగా స్వామి వారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



కొత్తరంగులతో అలంకరించిన స్వామి సన్నిధి

శోభాయమానంగా దేవస్థానం..

బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంతో పాటు, శ్రీ పరుశురామలింగేశ్వరస్వామి, పుట్టాలమ్మ తల్లి దేవాలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్వాగత తోరణాలు, ఆర్చ్‌లకు పంచరంగులు, సున్నాలు, ఎర్రమన్ను వేసి ముస్తాబు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఆలయాలతో పాటు పరిసరాలను అలంకరించారు. గర్భాలయ గోపురం, ఆలయ కల్యాణ మండపాలు, గర్భాలయాలు రంగులతో కొత్తశోభను సంతరించుకున్నాయి. భక్తులకు వేసవి తాపం నుంచి రక్షణ కల్పించడానికి ఈసారి తెల్లని వస్త్రంతో పందిళ్లు ఏర్పాటు చేయడంతో పాటు, గుడి చుట్టూ ప్రదర్శన చేసేవారికి కాళ్లు కాలకుండా ఎండను తట్టుకునేలా తెల్లని పెయింట్ వేయించారు.

కార్యక్రమాలు ఇలా..

ఆదివారం స్వస్తి వాచనంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా 5వ తేదీ ఉదయం కలశస్థాపన, ధ్వజారోహణం, రాత్రి చక్రపెరుమాళ్ల ఉత్సవం, 6న సూర్యప్రభ వాహనం, చక్రపెరుమాళ్ల ఉత్సవం, రాత్రి చంద్రప్రభ వాహనం, 7న దీక్షాహోమం, వాస్తుహోమం, కల్యాణోత్సవం, అనంతరం శేషవాహనం, 8న దీక్షాహోమం, హనుమంత వాహనం, 9న దీక్షా హోమం, పూర్ణాహుతి, గరుడోత్సవం, 10వ తేదీ వసంతోత్సవం, శ్రీవారి పాన్పుసేవతో వేడుకలు ముగుస్తాయి.

ఏర్పాట్లు పూర్తయ్యాయి



బ్రహ్మోత్సవాలు విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశాం. ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక సేవాభావం కలిగించేలా వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. గతంలో కన్నా భిన్నంగా సౌకర్యాలు కల్పించాం. ముఖ్యంగా వేసవి కారణంగా ఎండల నుంచి భక్తులు ఇబ్బందులు పడకుండా పందిళ్లు వేయించాం. అలాగే ప్రదక్షిణ సమయంలో భక్తులు అవస్థలు పడకుండా ఆ దారి మొత్తాన్ని తెల్లటి రంగు పూయించాం. పూజలు వైభవంగా జరగనున్నాయి. – గంగుల మనోహర్‌రెడ్డి, రామతీర్థ పుట్టాలమ్మ క్షేత్ర పాలక మండలి చైర్మన్

నంద్యాల మండలం విభజనపై అభ్యంతరాలు తెలపండి

నంద్యాల: నంద్యాల మండలాన్ని నంద్యాల అర్బన్, రూరల్ మండలాలుగా విభజించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే 30 రోజుల్లోపు తమ దృష్టికి తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల మండలాన్ని పరిపాలన సౌలభ్యం కోసం, రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో రెండుగా విభజించిందన్నారు. నంద్యాల మండలంలో ప్రస్తుతం 20 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, వీటిని నంద్యాల అర్బన్ మండలంలో ఆరు రెవెన్యూ గ్రామాలు (నంద్యాల పట్టణం, మూలసాగరం, నూనెపల్లె, కొత్తపల్లె, ఊడుమాల్పురం, అయ్యలూరు), నంద్యాల రూరల్ మండలంలోకి 14 (పోలూరు, రాయమాల్పురం, మునగాల, పులిమద్ది, భీమవరం, బిల్లలాపురం, కొట్టాల, చాపిరేవుల, పుసులూరు, బ్రాహ్మణపల్లె, మిట్నాల, కానాల, చాబోలు, గుంతనాల) గ్రామాలను చేరుస్తామని పేర్కొన్నారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు.

స్ప్రేయర్ అందజేత

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయానికి ప్రముఖ న్యాయవాది చంద్రశేఖర్‌రావు, జూనియర్లు శశికుమార్, మల్లికార్జున శనివారం స్ప్రేయర్ అందజేశారు. వారు మాట్లాడుతూ కోర్టు ఆవరణలో దోమల నివారణకు రూ.10వేల విలువజేసే బ్యాటరీ స్ప్రేయర్‌ను అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోటపాడు శ్రీనివాసులుకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, ఏపీపీ వివేకానందరెడ్డి, శ్రీదేవి, షన్ను పాల్గొన్నారు.



దుప్పట్లతో నీడ ఏర్పాటు చేసుకున్న భక్తులు



స్వామివారి కల్యాణం కోసం ఎండలో నిరీక్షణ

లక్ష్మీపతీ..ఏదీ వసతి?

- భానుడి ప్రతాపం.. భక్తులకు తాపం
- అహోబిలంలో నీడ కోసం పాట్లు
- నరసింహస్వామి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు

ఆళ్లగడ: బ్రహ్మోత్సవాల సందర్భంగా అహోబిల శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అధికారులు సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. సరైన వసతులు లేక భక్తుల ఇబ్బందులు వర్ణనాతీతం. బ్రహ్మోత్సవాలకు భక్తుల రద్దీ క్రమేపీ పెరుగుతోంది. శనివారం ఎగువ అహోబిలంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం ఉండటంతో సుమారు 10 వేల మంది భక్తులు వస్తారని అంచనా. అయితే అందుకనుగుణంగా అవసరమైన సౌకర్యాలు కల్పించక పోవడంతో రాత్రి జరిగే కల్యాణం కోసం ఉదయం నుంచి సేద తీరేందుకు ఎండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భక్తులకు నీడ ఏర్పాటు చేయక పోవడంతో అనేక మంది భక్తులు చెట్ల కింద, కొండ నీడలో నిల్చుండిపోయారు. కల్యాణ మహోత్సవం జరిగే సమయంలో వేడుక చూడటానిక స్థలం దొరకదేమోనని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తాము తెచ్చుకున్న దుప్పట్లు, బెడ్‌షీట్లు, ప్లాస్టిక్ పట్టలతో నీడ ఏర్పాటు చేసుకుని ఉదయం నుంచి రాత్రి వరకు నిరీక్షించారు. తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నా దేవస్థాన సిబ్బంది కనిపించక పోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు నీడ కూడా ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిచ్చింది. ఇప్పటికైనా దేవస్థాన సిబ్బంది తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు వద్ద విద్యుత్ తీగలు ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామ సమీపంలోని ఓ రైతు పొలంలో మొక్కజొన్న కోతలు కోసి యంత్రంపై గ్రామంలోకి తిరిగి వస్తున్నాడు. దారిలో తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి యంత్రంపై ఉన్న శ్రీనాథ్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. శిరివెళ్ల మండలం వనికెనిదిన్నె గ్రామానికి చెందిన శ్రీనాథ్ కొద్ది రోజులుగా యంత్రం వెంట కూలీ పనులను వెళ్తున్నాడు. ఇందులో భాగంగానే శనివారం కోత పనులు ముగించుకొని వచ్చే సమయంలో యంత్రంపై కూర్చొని ఉండగా విద్యుత్ తీగలు తగిలి షాక్ కొట్టి మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.



మృతి చెందిన శ్రీనాథ్

సకాలంలో రుణాలు చెల్లించాలి

దొర్నిపాడు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో తీసుకున్న పంట రుణాలను రైతులు సకాలంలో చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని గుళ్లదూర్తి ఏపీజీబీ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడులో ఆర్థిక మరియు సాంకేతిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సంవత్సరం లోగా చెల్లించి రెన్యూవల్ చేసుకుంటే సున్నా వడ్డీ పథకం వర్తిస్తుందన్నారు. అలాగే ఈ–క్రాప్‌లో ఒక పంట నమోదు చేసి బ్యాంకులో మరో పంట సాగుచేసినట్లు రుణాలు పొందితే వడ్డీ సొమ్ము తిరిగి రాదని స్పష్టం చేశారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన రూ.436 చెల్లిస్తే సాధరణ మరణం సంభవించినా రూ. 2లక్షలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన రూ.20 వార్షిక చందాతో రూ.2లక్షల ప్రమాద బీమా పొందవచ్చని చెప్పారు. అనంతరం కళాజాత బృందం ప్రదర్శన రైతులను ఆకట్టుకుంది.



రైతులకు అవగాహన కల్పిస్తున్న కళాజాత సభ్యులు

ఆధ్యాత్మికం

వేణుగోపాలుడిగా ప్రహ్లాదవరదుడు



గజవాహనంపై ఆశీనులైన ఉగ్రనరసింహుడు



పొన్నచెట్టు వాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శనివారం దిగువ అహోబిలంలో కొలువైన శ్రీ ప్రహ్లాదవరద స్వామి వేణుగోపాల స్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున నిత్య పూజల్లో భాగంగా సుప్రబాత సేవతో స్వామిని మేలుకొలిపిన అనంతరం అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ఉత్సవమూర్తి శ్రీ ప్రహ్లాదవరదస్వామిని వేణుగాపాలస్వామి అలంకారంలోను శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను రుక్మిణీ, సత్యభామలుగా అలంకరించి కొలువుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయ దేవేరులతో ఉత్సవ పల్లకీని అధిరోహించి మాడ వీధుల్లో ఊరేగారు. రాత్రి పొన్నచెట్టు వాహనంపై కొలువుదీరారు. ఎగువ అహోబిలంలో కల్యాణోత్సవానికి ముందు విశేష పూజలు అందుకున్న ఉగ్ర నరసింహస్వామి గజవాహనం అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

రుద్రవరం: మండల కేంద్రంలో నూతనంగా ఆలయం నిర్మించిన ఆలయంలో, రుద్రవరం–అప్పనపల్లె రహదారిలోని వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు స్వామి వారికి నిత్య పూజలు గావించిన అనంతరం పట్టు వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



స్వామి వారికి పూజలు చేస్తున్న దృశ్యం

మందలూరులో పెద్దమ్మ జాతర



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

రుద్రవరం: మండలంలోని మందలూరులో గ్రామస్తులంతా ఏకమై పెద్దమ్మ జాతర చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నిపుణులు ప్రత్యేకంగా అమ్మవారిని తయారు చేసి రుంగులద్దారు. అనంతరం వస్త్రాలు నగలు అలంకరించి మండపంలో అమ్మవారిని కొలువు తీర్చేందుకు ప్రత్యేక పీటాన్ని సిద్ధం చేశారు. జాతర సందర్భంగా ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎలాంటి అల్లర్లకు పాల్పడకూడదని సూచించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తెల్లవారు జామున అమ్మవారిని పీఠంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేస్తామని చెప్పారు. కాగా వేడుకల సందర్భంగా గ్రామంలోని లోగిళ్ల బంధుమిత్రులు, ఆడపడుచులతో కళకళలాడుతున్నాయి.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

నంద్యాల(వ్యవసాయం): అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని, శనివారం నృసింహ ద్వాదశి సందర్భంగా పట్టణంలోని రెవెన్యూ క్వార్టర్స్ హిందూ అన్నదాన సత్రం, బాలాజీ కాంప్లెక్స్‌లోని నరసింహస్వామి ఆలయంలో కల్యాణం జరిపించారు. వేదమంత్రోచ్చారణల మధ్య గణపతిపూజ, కంకణ ధారణ, జీలకర్ర, తాళిబొట్టు, తలంబ్రాలు, తదితర కార్యక్రమాలను వేదయుక్తంగా నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

బీఎల్‌ఓలకు ఓటర్ స్లిప్‌ల పంపిణీ

దొర్నిపాడు: ఎమ్మెల్సీ ఎన్నిలకు సంబంధిచిన ఓటర్ స్లిప్‌లను తహసీల్దార్ జయప్రసాద్ అన్ని గ్రామాల బీఎల్‌ఓలకు శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లకు వెంటనే స్లిప్‌లు అందజేసి వారితో సంతకం చేయించుకోవాలని సూచించారు. పంపిణీలో నిర్లక్ష్యం వహించొద్దని చెప్పారు. 525 మంది పట్టభద్రులు, 19 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని, స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారికి వేర్వేరుగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యుత్, వెంటిలేషన్, బోర్డులు తదితర సౌకర్యాలను సమకూర్చామని తెలిపారు. పోలింగ్ రోజు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రత చర్యలు సైతనం చేపట్టామని, ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు సమకూర్చామని వివరించారు.

ఉయ్యాలవాడ : రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ స్లిప్‌లను ఉయ్యాలవాడలో పట్టభద్రుల ఓటర్లకు తహసీల్దార్ రవికుమార్ శనివారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పట్టభద్రుల ఓటర్లు 687 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 21 మంది ఉన్నారన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. ఎన్నికల ఏజెంట్లు గంట ముందే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటస్వామి ఉన్నారు.



బీఎల్‌ఓలకు ఓటర్ స్లిప్‌లు అందజేస్తున్న తహసీల్దార్ జయప్రసాద్

క్రిష్టిపాడు వద్ద ఓ జొన్న పైరుపై గుంపులుగా వాలుతున్న పిట్టలు



పిట్టలు బాబోయ్..

- గుంపులుగా పంటపై వాలి గింజలను తినేస్తున్న వైనం
- ఫలించని ప్రయోగాలు
- ఆందోళనలో రైతులు



పొలంలో చైనా మైక్ కట్టిన రైతులు

దొర్నిపాడు: విత్తు వేసినప్పటి నుంచి పంట ఇంటికి తెచ్చుకునే వరకు చీడపీడలు, తెగుళ్ల దెబ్బతీస్తుంటే రైతులు క్రిమిసంహారక మందులతో వాటిని అదుపులోకి తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం జింకలు, అడవి పందులు పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో పంటల చుట్టూ చీరలు కట్టడం, తీగలు చుట్టడం, చైనా మైకులతో శబ్ధాలు చేస్తూ వాటిని రానివ్వకుండా చేస్తున్నారు. అయితే పురుగులు, జింకలు, అడవి పందుల కన్నా వేగంగా పిట్టలు పంటను నాశనం చేస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో గుంపులుగా పైర్లపై వాలి గింజలను తినేస్తున్నాయి. మెరుపు తీగలు కట్టినా, వివిధ రకాల చప్పుళ్లు చేస్తూ, చైనా మైక్‌లతో హోరెత్తిస్తూ పొలం చుట్టూ తిరుగుతున్నారు. అయినా అటు వైపు వెళ్లగా ఇటువైపు పంట వాలిపోతున్నాయి. దీంతో ఏమి చేయాలో తెలియక రైతన్నలు తలలు పట్టుకుంటున్నారు.

పశువుల పేడకు భలే గిరాకీ



దొర్నిపాడు నుంచి తాడిపత్రి ప్రాంతానికి ట్రాక్టరులో తరలిస్తున్న పశువుల పేడ

దొర్నిపాడు: సేంద్రియ సాగుపై రైతులు ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా పల్లెలో దొరికే పశువుల పేడకు భలే గిరాకీ నెలకొంది. ట్రాక్టర్ ట్రాలీ రూ.5వేల వరకు ధర పలుకుతోంది. అనంతపురం, తాడిపత్రి, పాణ్యం తదితర ప్రాంతాల్లో పండ్లు, కూరగాయల తోటలు అధికంగా సాగుచేస్తుండంతో దొర్నిపాడు, క్రిష్టిపాడు, రామచంద్రాపురం, చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని పాడి రైతుల నుంచి ఏటా పశువుల పేడను కొనుగోలు చేసి తరలిస్తారు. ఇందులో భాగంగా గురువారం దొర్నిపాడు నుంచి తాడిపత్రి ప్రాంతానికి పేడను ట్రాక్టర్‌లో తరలించారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న రామసుబ్బారెడ్డి, చిత్రంలో ఎంపీ పోచా, ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి

పాణ్యం: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూజ రవీంద్రారెడ్డి తెలిపారు.శనివారం నెరవాడ వద్దనున్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో పట్టభద్రులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ నేడు రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్తుందన్నారు. ఈ ప్రగతికి సీఎం వైఎస్ జగన్ ముందుచూపే కారణమన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య, ఉపాధి రంగాలకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్య సమస్యలకు పరిష్కారం చూపి వ్యవస్థను పూర్తిస్థాయిలో బలోపేతం చేశారని వివరించారు. ఈనెల 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శాంతిరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.